క్లుప్తంగా

నిశ్చితార్థ వేడుకలో మాజీ ఎమ్మెల్యేలు కేపీ, అన్నా, జంకె



నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు కేపీ, అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి కుమార్తె పార్వతి, శేఖర్‌రెడ్డి నిశ్చితార్థం ఆదివారం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, గిద్దలూరు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవీ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ సిరాజ్‌తోపాటు పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు పాల్గొని ఆశీర్వదించారు.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

గిద్దలూరు రూరల్: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సమస్యలపై స్పందించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మీ, జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు, ఎంపీపీ హేమలత, ఇతర శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి పూజలు



ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ఎల్లమ్మతల్లికి పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఎల్లమ్మ కొలుపులను పురస్కరించుకుని ఉభయదాతలు నెల పొంగళ్లు పెట్టి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు.

పేకాట స్థావరాలపై దాడులు

పుల్లలచెరువు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. పుల్లలచెరువు, శతకోడు, ఐటీ వరం గ్రామాల్లో మెరుపుదాడులు చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాటాడుతుండగా, అదుపులోకి తీసుకున్న వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: స్థానిక శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తజనుల హరిహర ధ్యానాల మధ్య ఆదివారం వైభవంగా జరిగింది. త్రిపురాంతక స్వామి ఆలయ కుమారగిరి ప్రదక్షిణను ఆషాడ పౌర్ణమి సందర్భంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు ఆశీర్వచనం అందించారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి


ఉలవపాడు: విద్యార్థులు పుస్తకాలను ఇష్టంగా చదవాలని ఉలవపాడు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఉలవపాడు గ్రంథాలయం. దానికి అనుబంధంగా నడిచే చాకిచర్ల బీడీసీఎల్‌లో జరుగుతున్న చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను ఇష్టంగా చదివి జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు చదివించారు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



అర్ధవీడులో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



శాకంబరి అలంకరణలో అమ్మవారు



మార్కాపురం : సాయి సత్యవ్రతాల్లో పాల్గొన్న బాబా భక్తులు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



తర్లుపాడులో పూజల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా



మార్కాపురం : బాబా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలయం వద్ద కోలాటం

మార్కాపురం/మార్కాపురం టౌన్: గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెహ్రూ బజారులోని షిరిడీ సాయిబాబా మందిరంలో సుమారు 3500 మందికి పైగా భక్తులు, పుర ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం బాబా పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సుమారు 30 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కమిటీ కార్యదర్శి జి.హరిహరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయినగర్‌లోని సాయి సత్సంగ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డీసాయిబాబా ఆలయాలకు వెళ్లి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో సాయిబాబా చిత్రపటాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

తర్లుపాడు: స్థానిక షిరిడీసాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించారు. తర్లుపాడుతో పాటు నాయుడుపల్లి, మీర్జాపేట, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, సీతానాగులవరంతోపాటు పలు గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్న బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, పలువురు ప్రజాప్రతినిధులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగమల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని సాయిబాబా ఆలయం, విశ్వనాథపురంలోని బాబా మందిరం, కంభాలపాడులో సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున నగర సంకీర్తనతో ప్రారంభమైన వేడుకలు కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, పల్లకి గ్రామోత్సవం, సాయినామ సంకీర్తనతో ముగిసాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవాలు

కొమరోలు: కొమరోలులోని రాజుగారికోటలో వెలసిన షిర్డీసాయిబాబా దేవస్థానంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయిబాబాకు అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

అర్ధవీడులో..

అర్ధవీడు (బేస్తవారిపేట): అర్ధవీడులోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, మధ్యాహ్నం కాగడహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని మొహిద్దీన్‌పురం సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిపారు.

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు

బేస్తవారిపేట: గురుపూర్ణిమ సందర్భంగా దరగ కొండపై త్రిలోక పుణ్యక్షేత్రంలోని సాయిబాబా ఆలయం, బేస్తవారిపేటలోని దత్తసాయి భరద్వాజ్ ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. సాయిబాబా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, కాగడహారతి, ప్రత్యేక పూజలు చేశారు. త్రిలోక పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన కోలాట భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

గిద్దలూరు రూరల్: ఆషాఢమాసంలో వచ్చే గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని వివిధ కూరగాయలతో శాకంబరి అమ్మవారిగా అలంకరించారు. పిడతల రమేష్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమార్కెట్ వద్ద సాయిబాబా ఆలయం, రాచర్ల రోడ్డులోని సాయిబాబా మందిరాలల్లో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కాశినాయనకుంటలోని రామక్రిష్ణ ధ్యాన మందిరంలో వేమనసేవా సమితి అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ప్రాముఖ్యత గురించి భక్తులకు ఉపన్యాసం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



కొమరోలు : పూజలు అందుకుంటున్న సాయిబాబా



బాబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



పొదిలి : రథం రోడ్డులో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



పొదిలి : కంభాలపాడులో పూజల్లో భక్తులు

వినియోగదారుల నష్ట నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న రామారావు

పొదిలి: వినియోగదారులు నష్టపోకుండా చూడటమే వినియోగదారుల రక్షణ సమితి లక్ష్యమని ఆ సమితి అధ్యక్షులు ధర్నాసి రామారావు పేర్కొన్నారు. ఆదివారం పొదిలి యూనిట్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల పలు రకాలుగా నష్టపోతున్నారని, నిర్దిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని చెప్పారు. జరిగిన నష్టం భర్తీ చేసేందుకు, న్యాయం చేసేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా పట్టణంలో డిష్ బిల్లులు ఇష్టానుసారం వసూలు చేస్తున్నారని, కల్తీపాల నివారణ, హోటళ్లలో నాణ్యతా లోపాలు, కలుషిత తాగునీటి సరఫరా, పట్టణంలో పారిశుధ్యం తదితర విషయాలపై లోతుగా చర్చించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు సీపీసీ తరఫున ఫిర్యాదు చేయనున్నట్లు రామారావు చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం గురించి ఈ ఏడాది ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తీర్మానించారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి జి.గౌస్ బాషా, కోశాధికారి రాంబాబు, సభ్యులు మహమ్మద్ జిలానీబాషా, ధర్నాసి పెద్దన్న, సీహెచ్.సుబ్బారావు, కేశవరావు, జేబీషా, బి.వి.రెడ్డి, సుబ్బారావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్లతో ప్రజల ఇక్కట్లు



అర్బన్ కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు వర్షపు నీటితో ఉన్న దృశ్యం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని అర్బన్ కాలనీ, ఆర్టీసీ డిపో వీధి, రాజానగర్, నల్లబండ బజారు, శ్రీరామ్‌నగర్, పాములపల్లెకురోడ్డు వర్షాల కారణంగా జలమయమై బురదరోడ్లుగా మారాయి. దీంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. తేలికపాటి వర్షాల కారణంగానే రోడ్లు జలమయమవుతూ వర్షపు నీరంతా రోడ్ల మీదనే నిల్వ ఉంటోంది. అర్బన్ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక వర్షపు నీరు రోడ్డు మీదనే ఉండిపోయింది. దీంతో అటు వైపుగా వెళ్లే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ డిపో, పాములపల్లెకు వెళ్లేందుకు అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను గుర్తించి బురదమయమైన రోడ్లను బాగు చేయించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

27న మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: ఈనెల 27 తేదీన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పారిశుధ్యం అధ్వానం

కొమరోలు: రెండు మూడు రోజులుగా కొమరోలు పట్టణంలో పారిశుధ్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరోలు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. రెండు వారాల క్రితం కార్మికులు తమ వేతనాలు అందించాలంటూ నిరసన దీక్షలు చేయగా వెంటనే మంజూరు చేస్తామంటూ గ్రామసర్పంచ్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కానీ రెండు వారాలు గడిచినా సంబంధిత కార్మికులకు వేతనాలు అందించక పోవడంతో పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరూ మూకుమ్మడిగా విధులకు గైర్హాజరయ్యారు. దీంతో కొమరోలులో ఎక్కడ వేసిన చెత్త అక్కడే దర్శనమిస్తుంది. నాలుగు రోడ్ల కూడలి వద్ద చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు మంజూరు చేయాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.



కొమరోలు : కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద కుప్పలుగా ఉన్న చెత్త

అద్దె బస్సుల ఎస్ఆర్‌లు ఎక్కడ?



దీక్షదారులకు మద్దతు తెలుపుతున్న యూనియన్ సభ్యులు

పొదిలి: అద్దె బస్సులకు సంబంధించిన ఎస్ఆర్‌లు ఏఎంటీ కార్యాలయంలో మాయమైతే దాని గురించి అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. బి.రోషన్ కుమార్ ఆధ్వర్యంలో కేపీ బాబు, సీహెచ్ సీఎస్ బాబు దీక్షలో కూర్చున్నారు. వీరికి కొండలు, ఎస్.వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఆర్‌లు మాయమైతే అవి ఎక్కడ ఉన్నాయో అధికారులకే తెలియని స్థితి సంస్థ కార్యాలయంలో ఏర్పడిందన్నారు. కార్మికులు చిన్నపాటి తప్పు చేస్తే వారి పొట్టకొట్టేలా అధికారుల చర్యలు ఉంటున్నాయన్నారు. ఈ పక్షపాతం లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే నిరాహార దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. 1-2019 సర్క్యులర్ అమలు చేయకుండా డీఎం ఇష్టానుసారంగా గిట్టనివారిపై చర్యలు తీసుకునే విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. అక్రమ మస్టర్లు నమోదు చేసి సంస్థకు ఆర్థిక నష్టం కలిగించిన వారిపై ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. డిపోలోని ఉద్యోగుల పక్షపాత వైఖరి, విధి నిర్వహణలో లోపాలు, అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టు 10న జన విజ్ఞాన వేదిక మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలో ఆగస్టు 10న జన విజ్ఞాన వేదిక వార్షిక మహాసభల నిర్వహణకు సహకరించాలని సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాష్ కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఫాంప్లేట్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 36 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక సమాజంలోని మూఢ నమ్మకాల నిరోధానికి, పర్యావరణ పరిరక్షణకు విద్య, ఆరోగ్యం, సామాజిక, సాంస్కృతికాభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.శరత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఇతర ఆరోగ్య సమస్యలపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం కోసం వారిలో దాగిఉన్న సృజనాత్మకత శక్తిని వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జడ్డా రమణయ్య, వి.వెంకటేశ్వర్లు, దేవ ప్రసాద్, రఫీ, వెంకటరావు, ఏనుగుల రవికుమార్, రమణారెడ్డి, కోటిమోహన్, నాసరయ్య, శేఖర్, ప్రదీప్‌కుమార్, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.